అంగన్వాడీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట, వీరఘట్టం, భామిని ప్రాజెక్ట్‌ల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మూడు ప్రాజెక్టుల్లో 17 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వగా వీటిలో 16 ఉద్యోగాలకు 44 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాలకొండ ఆర్‌డిఒ లావణ్య, డిఎంహెచ్‌ఒ బి.జగన్నాధరావు, ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ రాణి, సిడిపిఒలు, పి.రంగలక్ష్మి, సూపర్ వైజర్లు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యుద్ధం మొదలైంది

- టిడిపి, జనసేన కలయికతో జగన్‌కు భయం
- వైసిపి పాలనలో పెరిగిన నిరుద్యోగం
- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణనూ అడ్డుకోలేకపోయారు
- యువగళం బహిరంగ సభలో టిడిపి యువనేత లోకేష్

టిడిపి , జనసేన అధినేతల మాటామంతీ

అభివాదం చేస్తున్న యువతులు

బహిరంగ సభకు హాజరైన జనసంద్రం

హోర్డింగ్ పైకి ఎక్కిన అభిమానులు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి, కోట, భోగాపురం

'యుద్ధం ఇప్పుడే మొదలైంది.. ఇది ముగింపు కాదు.. తాడేపల్లి ప్యాలెస్ గోడలు బద్దలు గొట్టే వరకూ ఆగదు' అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. భోగాపురం మండలం పోలిపల్లి సమీపన నిర్వహించిన యువగళం-నవశకం విజయోత్సవ సభలో లోకేష్ మాట్లాడారు. తాను చేపట్టిన యువగళం పాదయాత్ర, జనసేన అధినేత పవన్ కల్యాన్ చేపట్టిన వారాహి యాత్రతో సిఎం జగన్‌కు భయం పట్టుకుందన్నారు. సాగనిస్తే పాదయాత్ర అవుతుందని, లేదంటే దండయాత్ర అవుతుందని అన్నారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలకు పాల్పడడంతో అదే చేసి చూపించానని అన్నారు. చంద్రబాబును అరెస్టు చేసినా తప్పు ఉన్నట్టు తేల్చలేకపోయాడన్నారు. జగన్‌ను అరెస్ట్ చేస్తే ప్రతి కేసుకూ ఒక స్కామ్ బయట పడుతుందని అన్నారు. ఆడుకుందాం ఆంధ్రా అంటూ జగన్ ఇప్పుడు కొత్త నాటకానికి తెర లేపారని విమర్శించారు. ఇందులో ఆటగాళ్లంతా అవినీతి మరకలు అంటించుకున్న వారేనన్నారు. ఈ ఐదేళ్ల పాలనలో జగన్ ఎన్నో విధ్వంశాలు సృష్టించాడని అన్నారు. తన పాతయాత్రలో అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయని తెలిపారు. పేదలు చదువుకోసం, పొట్టకూటికోసం ఎదురు చూస్తున్నారని, రైతులు, నిరుద్యోగుల సమస్యలు పేరుకుపోయాయని అన్నారు. 31మంది ఎంపిలు ఉండి కూడా విశాఖ ఉక్కు విక్రయాన్ని అడ్డుకోవడం లేదన్నారు. పైగా ఉక్కు భూములు కొట్టేసెందుకు చూస్తున్నారని, ఋషికొండకు గుండు కొట్టి దోచుకునేందుకు చూస్తున్నాడని విమర్శించారు. విశాఖలో తాను ఎన్నో ఐటీ పరిశ్రమలు ఏర్పాటు చేశానని, జగన్ వచ్చాక ఉన్న పరిశ్రమ ఇతర రాష్ట్రాలకు పోతున్నాయి. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేయలేకపోయారని అన్నారు. విశాఖ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. పచ్చ బటన్ నొక్కి ... మరో వైపు రెడ్ బటన్ నొక్కి ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు, మద్యం ధరలు పెంచారని విమర్శించారు. జాబ్ కేలండర్ మాట తప్పి నిరుద్యోగులకు మోసం చేశారని దుయ్యబట్టారు. ఉత్తరాంధ్ర సృజల స్రవంతి కూడా నిర్మించలేదని విమర్శించారు. సిపిఎస్‌ను రద్దు చేస్తామని ఉద్యోగులను మోసం చేశారని, చివరికి వేతనాల్లో కోత పెట్టి పోలీసులకు కూడా మోసం చేశాడని అన్నారు. జగన్ పని అయిపోయిందని, అందుకే ఎమ్మెల్యేలను ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని అన్నారు. జగన్ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీశారని అన్నారు. లక్షకోట్లు దోచేసిన వ్యక్తి, ప్యాలెస్‌లో ఉంటున్న వ్యక్తి పేదవాడు అవుతాడా అని ప్రశ్నించారు. ప్రజల ఆత్మ గౌరవానికి మధ్య యుద్ధం జరుగుతోందని, మూడు నెలల్లో ప్రజా స్వామ్యం పవర్ ఏంటో చూపాలని అన్నారు. కష్ట కాలంలో పవన్ కల్యాణ్ ఫోన్ చేసి ధైర్యం చెప్పారని, యువగళం పాదయాత్ర లో ఎంతో మంది సహకరించారని అన్నారు.

మాట్లాడుతున్న బాలకృష్ణ

- జనసేన పొలిటికల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ టిడిపి, జనసేన కలిసి ముందుకు వెళ్తే ప్రజారంజకమైన ప్రభుత్వం ఏర్పాటవుతుందన్నారు. ఈ రాష్ట్రానికి వచ్చిన కష్టకాలంలో జనసేన, టిడిపి కలిసి పనిచేసేందుకు నిర్ణయించుకున్నాయన్నారు. ఐటి అభివృద్ధి కుంటుబడటంతో నిరుద్యోగ సమస్య ఏర్పడిందన్నారు. సంక్రాంతి లోపు చక్కటి మేనిఫెస్టో రూపొందించు కుంటామని, ఇరు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని చెప్పారు.
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లడుతూ యువనేత లోకేశ్ పాదయాత్రకు సైకో జగన్ ఎన్నో ఆటంకాలు సృష్టించాడన్నారు. ఈ సభను చూసి జగన్ వెన్ను వణుకుతుందన్నారు. టిడిపి, జనసేన కలయికతో బలహీన వర్గాలను దూరం చేయడానికి జగన్ ప్రయత్నిస్తున్నారన్నారు. ఉత్తరాంధ్రను విజయ సాయిరెడ్డి, సుబ్బారెడ్డిలకు కట్టబెట్టారని విమర్శించారు. సిగ్గుంటే మంత్రి బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు ఆ పార్టీకి, పదవులకు రాజీనామా చేయాలన్నారు. 100 రోజుల్లో వైసిపిని బంగాళాఖాతంలో కలిపితే తప్ప ప్రజలకు బతుకులేదన్నారు.
- సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ వైసిపి అక్రమాలు, అన్యాయాలకు అడ్డుకట్ట వేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎన్‌టిఆర్ ప్రభంజనం నెమరు వేసుకునేలా నేడు జన ప్రభంజనం కనిపిస్తోందన్నారు. చంద్రబాబు ఎంతో దూరదృష్టి గల నాయకుడన్నారు. ఇటీవల కాలంలో పవన్ కళ్యాణ్ సినిమాల్లో కన్నా రాజకీయాల్లోనూ, ప్రజా సేవలోనూ ఎక్కువగా ఉంటున్నారని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వంలో ఉద్యోగులకు వేతనాలు కూడా సకాలంలో అందడం లేదన్నారు. కనకపు సింహాసనం మీద శునకం కూర్చున్నట్టుగా ఉందని సీఎం జగన్‌ను విమర్శించారు. రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతులకు జగన్ మోసం చేశాడని అన్నారు.
- శ్రీకాకుళం ఎంపి కింజరాపు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఈ సభ ఏర్పాటు చేసుకోవడం చరిత్ర ఘట్టమన్నారు. ఇది ముగింపు కాదని, ఇప్పుడే ప్రారంభమైందని అన్నారు. నాలుగున్నరేళ్లలో ప్రజలను అనేక ఇబ్బందులు పెట్టారన్నారు. నవశకం ఊపు అందుకుందన్నారు.
- జనసేన నాయకులు పంచకర్ల రమేష్ మాట్లాడుతూ రాష్ట్రానికి దశ దిశ చూపడానికి ఎన్ని అడ్డంకులు సృష్టించినా పాదయాత్ర ముగింపు చేశారన్నారు.

సభకు శ్రీకాకుళం ఎంపి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యుల వర్ల రామయ్య అధ్యక్షత వహించారు. పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపిలు, మాజీ మంత్రులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

బహిరంగ సభ వేదికపై నుంచి అభివాదం చేస్తున్న నారా లోకేష్

మీడియా, విఐపి గ్యాలరీల్లోకి దూసుకొస్తున్న కార్యకర్తలు

చేతులెత్తేసిన వాలంటీర్లు

సభకు భారీగా టిడిపి, జనసేన కార్యకర్తలు తరలిరావడంతో వారిని నియంత్రించడంలో యువగళం వాలంటీర్లు చేతులెత్తేశారు. దీంతో పలుచోట్ల తోపులాటలు చోటు చేసుకున్నాయి. వేలాదిగా వచ్చిన వారిని నియంత్రణ చేయడంలో వాలంటీర్లు చేతు లెత్తేశారు. బారికేడ్లు దూకి వచ్చిన వారిని నియంత్రించడంలో వాలంటీర్లకు సాధ్యం కాలేదు. సభ ముగింపు అనంతరం బయటకు వెళ్లేందుకు మహిళలు, వృద్ధులు అనేక అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ స్తంభించిపోయి కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నారా లోకేష్

బహిరంగ సభకు హాజరైన నారా, నందమూరి కుటుంబ సభ్యులు

బహిరంగ సభ వేదికపై టిడిపి, జనసేన నాయకులు

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

విద్యాశాఖ పరిధిలోని సమగ్ర శిక్షలో పనిచేస్తున్న 18 విభాగాల కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్, పార్ట్ టైం, ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె ప్రారంభించారు. ఈ మేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద సర్వ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ జెఎసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు ఎ.పొలినాయుడు, కె.భారతి, బివి రమణ, బి.ఈశ్వరరావు, తదితరులు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ముఖ్యమంత్రి గత ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన నేటికీ అమలు చేయలేదన్నారు. ఉద్యోగ భద్రత, మినిమం టైం స్కేల్, గ్రాడ్యుటీ, పిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు పెంచినప్పటికీ సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులకు జీతాలు పెంచకపోవడం సమంజసం కాదని అన్నారు. సుప్రీంకోర్టు సూచన ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సర్వ శిక్ష ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో విశిష్ట ప్రతిభ కనబరుస్తున్న ఈ విభాగంలో ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరైన విధానం కాదన్నారు. నిర్దిష్ట కాలం ప్రాతిపదికన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, మెడికల్ లీవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ చేసే వరకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో ఇప్పటికే అనేక దశల్లో ఆందోళన చేపట్టామని, అయినప్పటికీ ప్రభుత్వంలో స్పందన లేని నేపథ్యంలోనే ప్రభుత్వానికి ఉద్యోగుల గోడు తెలియజేయడం కోసం రాష్ట్రవ్యాప్త సమ్మెను చేపట్టామని తెలిపారు.

ఎంఇఒ, కెజిబివిల్లో పనిచేస్తున్న వివిధ విభాగాల సిబ్బంది, స్కూల్లో పనిచేస్తున్న సిబ్బంది సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా రాష్ట్రస్థాయి జేఏసీ నాయకత్వంతో చర్చలు జరిపి సమ్మెను విరమించేలా చర్యలు చేపట్టాలని, లేనిచో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు సిహెచ్ భాను ప్రకాష్, ఎ.దివాకర్, జి.రమేష్, వై.గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ రాక

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఉన్నత విద్య రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ, జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ జె.శ్యామలరావు జిల్లాకు గురువారం రానున్నారని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం - 2024లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎటువంటి సందేహాలు, సమస్యలున్నా జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్‌కు తెలియజేయవచ్చని అన్నారు.

26 తేదీకి క్లైములు పరిష్కారం

ఓటరు జాబితాలో క్లైములు, అభ్యంతరాలపై డిసెంబరు 9వరకు స్వీకరించిన దరఖాస్తులను ఈనెల 26 నాటికి వాటిని పరిష్కరిస్తామని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటరు జాబితాపై క్లైములు, అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు స్వీకరించడం జరిగిందని, వాటిని డిసెంబరు 26 నాటికి వాటిని పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. 2024 జనవరి 1న ఓటరు జాబితా తయారుచేసి జనవరి 5న తుది ప్రచురణ చేస్తామన్నారు. ఓటరు జాబితాలో ఓటరుగా నమోదు ఎన్నికల సమయం వరకు అవకాశం ఉంటుందని, కావున 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో 42360 ఫారం - 6, 46128 ఫారం - 7, 97230 ఫారం - 8 స్వీకరించడం జరిగిందని, వాటిపై విచారణ జరిపి డిసెంబరు 26 నాటికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. 18ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా చేర్పించేందుకు గానూ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్, వివి పాట్ పనితీరు, ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా ఎన్నికల కార్యాలయం, రిటర్నింగ్ అధికారి ప్రధాన కార్యాలయం లేదా రెవెన్యూ సబ్-డివిజన్ అధికారుల వద్ద శాశ్వత సెంటర్లు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొబైల్ ప్రదర్శన వ్యాన్ ఏర్పాటు చేశామని, మొబైల్ వ్యాన్ షెడ్యూలు ముందుగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేస్తామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రోత్సహించాలని జాయింటు కలెక్టరు తెలిపారు. డిఆర్ఒ జె.వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 185718 ఫారాలు స్వీకరించగా, వాటిలో 176638 ఫారాలు పరిష్కరించి ఓటరు జాబితాలో చేర్పిస్తామని, 2089 ఆమోదం చేయడం జరిగిందని, 4582 తిరస్కరణకు గురయ్యాయని, 2410 పరిష్కరించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌డిసిఆర్ కేశవనాయుడు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పి.రవికుమార్, బిఎస్‌పి పార్టీ ప్రతినిధి టి.వెంకటరమణ, బిజెపి ప్రతినిధి పి.అప్పారావు, లోక్ సత్తా పార్టీ ప్రతినిధి ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి తండ్రికి చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

విదేశీ విద్యా దీవెన పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్న విదేశీ విద్యా దీవెన, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకాల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో దీన్ని ప్రారంభించారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ హాజరయ్యారు. గరుగుబిల్లి మండలం ఉద్దవోలుకు చెందిన గంటేడ సత్యసాయి జగనన్న విదేశీ విద్యా దీవెనకు ఎంపికయ్యారు. సత్యసాయి జీఆర్ఇలో 340 మార్కులకు 319 మార్కులు, ఐఇఎల్టిఎస్ పరీక్షలో 9 పాయింట్ల 7 పాయింట్లు సాధించి పర్డ్యూ విశ్వవిద్యాలయంలో ఎంఎస్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో సీటు సంపాదించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యా దీవెన కింద రూ. 9,65,540 సహాయం అందించారు. జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకాల్లో భాగంగా బెలగాంకు చెందిన ఆమిటి హరీష్, వీరఘట్టం మండలం హుస్సేన్‌పురానికి చెందిన తాడెల కార్తీక్ పొందారు. ఇద్దరు సివిల్ సర్వీసెస్ ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. లక్ష రూపాయల చొప్పున ప్రోత్సాహకంగా పొందారు. కార్యక్రమంలో సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పిఒలు కల్పనా కుమారి, సి.విష్ణుచరణ్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిడి కె.శ్రీనివాస రావు, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

తమ సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈనెల 26 నుంచి సమ్మెలోకి వెళ్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు మున్సిపల్ కమిషనర్ జె. రామఅప్పలనాయుడుకు తెలిపారు. ఈ మేరకు గురువారం సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణతో కలిసి యూనియన్ నాయకులు కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు పాదయాత్రలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను నాలుగేళ్లయినా నెరవేర్చలేదని, వాటిని నెరవేర్చాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. సమ్మె నోటీసును అందజేసిన వారిలో మున్సిపల్ కార్మికులు చీపురుపల్లి, పడాల గాంధీ, నాగవంశం మల్లేష్, సింహాచలం ఉన్నారు.

పాలకొండ: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఈనెల 26నుంచి సమ్మెకు సిద్ధమవుతామని మున్సిపల్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్. సంజీవి కమీషనర్ సర్వేశ్వరరావు కు బుధవారం సమ్మె నోటీసు ఇచ్చారు. కార్యక్రమంలో కార్మికులు పి.వేణు, సురేష్, రామారావు, విమల తదితరులు ఉన్నారు.

పార్వతీపురంలో కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

పివిటిజి గ్రామాలకు విద్యుత్ కల్పనకు సర్వే

ప్రజాశక్తి - పార్వతీపురం

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఇపిడిసిఎల్) సంచాలకులు (ఆపరేషన్) బి.రమేష్ బుధవారం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్ (పివిటిజి) గిరిజన ఆవాసాలకు విద్యుత్ కల్పనకు సర్వే నిర్వహిస్తున్నట్లు రమేష్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. విద్యుద్దీకరణ దాదాపుగా పూర్తి అయ్యిందని, ఇంకా విద్యుదీకరణ లేకుండా గ్రామాలుంటే వాటికి పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా పార్వతీపురంలో పలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించా మని తెలిపారు. ఈ సందర్భంగా శాలువతో కలెక్టర్‌ను సత్కరిం చారు. కార్యక్రమంలో ఎస్ఇ ఎం లక్ష్మణరావు, ఇఇ డి.ఫణికిరణ్ కుమార్, డిఇ కె.వెంకట రత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

చేస్తామన్నవారితో పనులు చేయించండి

ఎంపిడిఒని ఆదేశించిన డిప్యూటీ సిఎం

రాజన్నదొరకు పనుల గురించి వివరిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- సాలూరు

జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలానికి మంజూరైన పనులను చేయడానికి ముందుకొచ్చిన వారితో చేయించాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆదేశించారు. ఎంపిడిఒ జి.పార్వతి బుధవారం డిప్యూటీ సిఎం రాజన్నదొరని ఆయన నివాసంలో కలిశారు. ఉపాధి హామీ పథకం కింద కోటి 20లక్షలు, మరో మూడు కోట్ల రూపాయలతో వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పనులు చేయడానికి ఆసక్తి లేనివారిని పక్కనపెట్టి చేయడానికి ముందుకొచ్చిన వారితో చేయించాలని ఆదేశించారు. సకాలంలో నిధులు ఖర్చు కావాలని సూచించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నిధులతో గ్రామాల్లో సిసి రోడ్లు, కాలువలు నిర్మించాల్సి వుందని ఎంపిడిఒ పార్వతి చెప్పారు.

కస్పా వీధిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని కస్పా వీధిలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి ఉమామహేశ్వరి గర్భిణులు, బాలింతలు, రక్తపోటు, మధుమేహం, చంటి పిల్లలకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి కావ్య, ఎఎన్ఎం జానకి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ టెస్ట్ పేపర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక విద్యాశాఖ కార్యాలయం ఆవరణలో బుధవారం మండల విద్యాశాఖ అధికారి డి గౌరు నాయుడు చేతుల మీదుగా ఎస్ఎస్‌సి 2024 మోడల్ టెస్ట్ పేపర్‌ని ఆవిష్కరించారు. ఈ మోడల్ పేపర్స్ పేద విద్యార్థులకు సరసమైన ధరలో ఉత్తీర్ణతకు అనుకూలంగా ఉంటాయని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు అన్నారు. గత సంవత్సరం ఈ మోడల్ పేపర్స్ నుంచి 60 నుంచి 70శాతం వరకు ప్రశ్నలు వచ్చాయన్నారు. నిపుణులతో తయారైన ఈ పేపర్స్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కే గోవిందరావు, అధ్యక్షులు బి దుర్గాప్రసాద్, కార్యవర్గ సభ్యులు శ్రీధర్, జెవీ సూర్యప్రకాష్, చంద్రమోహన్, సింహాచలం, రవీంద్ర, ఎంఎల్ఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం మండలం వెంకంపేట పంచాయతీ కార్యాలయంలో బుధవారం తహశీల్దార్ శివన్నారాయణ ఆధ్వర్యంలో ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని అన్ని వార్డు మెంబర్‌లతోపాటు గ్రామస్తులను సమావేశ పరిచి ఓటరు జాబితాను చదివి వినిపించారు. అభ్యంతరాలను నమోదు చేసుకుని తుది జాబితాను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తీళ్ళ కృష్ణారావు, మాధవరావు, జాగాన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భద్రగిరి ఆర్ఐటిఐలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి రెసిడెన్షియల్ ఐటిఐలో క్రిస్మస్ పండగ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సిహెచ్ సునీల్ కుమార్ కేక్ కట్ చేసి ముందుగా నూతన సంవత్సరం, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏకత్వంలో భిన్నత్వం అందరం కలిసి ఉండాలని అందుకే కేక్ కట్ చేయడం జరిగిందని చెప్పారు. క్రిస్మస్ గీతాలు పాడారు.

ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలి

ప్రజాశక్తి - కురుపాం

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికీ అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని స్థానిక ఎస్ఐ వి.షణ్ముఖరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల రావాడ జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీలు నిర్వహించి ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆటోలు, ఫోర్ వీలర్ నడిపే ప్రతి ఒక్క వాహనదారుడు అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, మద్యం సేవించకుండా వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది వాహనదారులు పాల్గొన్నారు.

మండలంలో ఎంపిడిఒ పర్యటన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మండను ఎంపిడిఒ కె.గీతాంజలి బుధవారం సందర్శించారు. గర్భిణులను, బాలింతలను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పోషకాహారం అందుతుందో లేదో తెలుసుకున్నారు. పౌష్టిక పోషకాహారం అందకపోతే అందజేస్తామని చెప్పారు. గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామస్తుల సమస్యలు విన్నవించారు.

కెవికె సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలో గల రస్తాకుంటుబాయిలో గల కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య ఎన్జీ రంగారావు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నడుస్తున్న కెవికెలోని శాస్త్రవేత్తలు నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తుంటారని కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం కెవికెకు అనుసంధానించబడ్డ కళాశాల విద్యార్థులు చేపడుతున్న రావెప్ కార్యక్రమాలు ఆర్‌బికె, కెవికెలో చేపడుతున్న కార్యక్రమాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ టిఎస్ఎస్ పాత్రో, ఎడిఎ నిర్మల జ్యోతి, కెవికె శాస్త్రవేత్తలు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



బలిజిపేట: వినతి పత్రాన్ని అందిస్తున్న విఒఎలు

విఒఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

గ్రామైక్య సంఘ సహాయకుల (విఒఎ) సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి ఇందిరా డిమాండ్ చేశారు. విఒఎల సమస్యల పరిష్కారానికై మండలం లోని వెలుగు కార్యాలయంలో బుధవారం సిసి మురళికు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఇందిరా సమక్షంలో వినతి పత్రాన్ని అందించారు. ఇందిరా మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, రాజకీయ జోక్యం నియంత్రించాలని, ఒత్తిడి తగ్గించాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో విఒఎలు గౌరీశ్వరి, జి. భారతి, సుమతి, సత్యవతి, శ్రీదేవి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్విన్ పేట ఎస్ఐగా శివ ప్రసాద్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎస్ శివ ప్రసాద్

ఎల్విన్ పేట ఎస్ఐగా బిఢిక శివప్రసాద్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన పాలకొండ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎస్ఐ గా పనిచేసిన షణ్ముఖరావు బదిలీపై కురుపాం వెళ్లారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శివ ప్రసాద్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు

కొమరాడ: స్వీటు దుకాణం వద్ద బిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

గరుగుబిల్లి: బిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మక్కువ: వీధుల్లో జోలీ పట్టి బిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

తొమ్మిదో రోజుకు అంగన్‌వాడీల సమ్మె

●కొనసాగుతున్న నిరవధిక సమ్మె ●పలుచోట్ల వాంటా వార్పు ●మరి కొన్ని చోట్ల బిక్షాటన చేసిన అంగన్‌వాడీలు

తెలంగాణా కంటే ఎక్కువ వేతనం ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఆ హామీని అమలు చేయాలని అంగన్‌వాడీలు తలపెట్టిన నిరవధిక సమ్మె బుధవారం 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు బిక్షాటన చేపడుతున్న నిరసన తెలిపారు.

బలిజిపేట : దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపడుతున్న చట్టబద్ద సమ్మెకు ప్రభుత్వం కూడా చట్టబద్ధంగా సమస్యలు పరిష్కారం చేయాలే తప్ప అందుకు విరుద్ధంగా చేపడుతున్న దుర్మార్గపు చర్యలను ఖండిస్తున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు తెలిపారు. స్థానికంగా అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ తెలంగాణా ప్రభుత్వం కంటే వెయ్యి రూపాయలు అదనంగా జీతాలు చెల్లిస్తానని చెప్పి సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతాలు చేసి ఈరోజు అంగన్వాడీ తాళాలను పగలగొట్టే నీచమైన స్థాయికి జగన్ దిగజారి పోయారన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో తమ ప్రభుత్వ సత్తా చాటుకోవాలని, లేనిపక్షంలో ప్రజలు బుద్ధి చెప్పక మానరని ఆయన హెచ్చరించారు. ఈనెల 22 వరకు ఈ సమ్మె కొనసాగుతుందని, అప్పటికే ప్రభుత్వం స్పందించకపోతే తదుపరి కార్యాచరణ చేపట్టి ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి ఇందిర, అంగన్వాడి మండల అధ్యక్షులు కె.దాలమ్మ, సావిత్రి, ఇతర నాయకులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో బిక్షాటన తెలుపుతూ నిరసన తెలిపారు.

పార్వతీపురంరూరల్ :అంగనవాడీ వర్కర్స్, హెల్పర్స్ సమ్మెలో భాగంగా పట్టణంలో బిక్షాటన నిర్వహించారు. ప్రాజెక్టు సెక్టార్ నాయకులు టి.రాజేశ్వరి, బి.నేలవేణి, పార్వతి, ధర్మావతి, కె.రాజేశ్వరి, ఎస్.గౌరీమణి, ఎం.అలివేలు, ఎం.గౌరీ, బి.శాంతి, జ్యోతి, సునీత, జయలక్ష్మి, కల్పన ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, సిఐటియు పట్టణ నాయకులు బంకురు సూరిబాబు నాయకత్వంలో బిక్షాటన చేశారు. సమ్మెకు మద్దతుగా ఎఐసిటియు రాష్ట్ర నాయకులు డి.శ్రీనివాసరావు, పట్టణ నాయకులు దామోదర్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ కన్వీనర్ ఎనుగుర్తి సంఘం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సింహాచలం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు తలపెట్టిన సమ్మెలో భాగంగా బిక్షాటన చేశారు. ఈ సమ్మెకు టిడిపి పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయ్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శుల్లు కొల్లి తిరుపతిరావు, ఆర్.వేణుగోపాల నాయుడుతో పాటు పరుగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సత్యవతి, సునీత, లక్ష్మి, శైలజ, యశోద, శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.రామలక్ష్మి, సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : అంగన్వాడీల సమ్మెలో గుమ్మలక్ష్మీపురంలో అంగన్వాడీలు బిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేటలో ప్రతి షాపు, ఇంటింటికి వెళ్లి బిక్షాటన చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి, మండల అధ్యక్ష కార్యదర్శులు సత్యవతి, కస్తూరి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి ఎం.రమణ పాల్గొన్నారు.

సాలూరు: ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిరసనగా అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు బిక్షాటన చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకులు బి.రాధ, ఎ.నారాయణమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు స్టేట్ బ్యాంక్ జంక్షన్ నుంచి బోసు బొమ్మ జంక్షన్ వరకు బిక్షాటన చేపట్టారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్యామల వరలక్ష్మి పార్వతీ తిరుపతమ్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మద్దతు: అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మెకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సిగడాపు బంగారయ్య, సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి పుండరీకాక్ష నాయుడు మద్దతు పలికారు. నిరసన శిబిరాన్ని సందర్శించి వారు మద్దతు తెలిపారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు ఆమోదించాలన్నారు.

కొమరాడ : మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు బిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. యూనియన్ ప్రాజెక్టు ఉపాధ్యక్షులు సిరికి అనురాధ, సెక్టార్ లీడర్ బి.అలివేలు, జ్యోతి, పద్మ, మల్లేశ్వరమ్మ మాట్లాడుతూ అన్ని బడ్డీలు వద్దకు వెళ్లి భిక్షాటన చేస్తూ మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్తూ ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావుకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో భారీగా అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: సమస్యలు పరిష్కారం కోరుతూ అంగన్వాడీలు తలపెట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం బిక్షాటన చేపట్టారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ నాయకులు గౌరమ్మ, మర్రాపు సావిత్రి మాట్లాడుతూ సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా వెనక్కి తగ్గేదేలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీలు, హెల్పర్ లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కురుపాం : కురుపాం, జియ్యమ్మవలస మండలాల చెందిన అంగన్వాడీలు అధిక సంఖ్యలో పాల్గొని కురుపాంలో పలు వీధుల్లో షాపుల్లోకి వెళ్తూ బిక్షాటన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరళ కుమారి, ప్రాజెక్టు కార్యదర్శి జె.సరోజ, సెక్టార్ లీడర్లు అంగన్వాడీలో వర్కర్లు, హెల్పర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ఎదుట అంగన్వాడీలు బిక్షాటన నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎం.తిరుపతిరావు హాజరై మాట్లాడారు కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.కాంతారావు, ప్రాజెక్టు కమిటీ సభ్యులు దర్శిమి, పార్వతి, నాయకులు సురేష్, కాంతారావు పాల్గొన్నారు.

పాచిపెంట : అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సభ్యులు టి.ప్రభావతి, ప్రాజెక్ట్ నాయకులు పార్వతి, రమణమ్మ, బంగారమ్మ ఆధ్వర్యంలో దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

మక్కువ :అంగన్వాడీ సిబ్బందికి ముఖ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మన్మధరావు ప్రభుత్వాన్ని డిమాండ్ వేశారు. అంగన్‌వాడీల సమ్మెకు ఆయన సంఘీభావంగా తెలిపారు. తొలుత ప్రధాన రహదారి ర్యాలీగా వెళ్లి అంగన్వాడీ కార్యకర్తలు బిక్షాటన తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, గిరిజన సంఘం నాయకులు టి.ప్రభాకరరావు, నాయకులు సుశీల, పాల్గొన్నారు.

పాచిపెంట: దున్నపోతుకు వినతి పత్రాన్నిస్తున్న అంగన్‌వాడీలు

సాలూరు: జోలీలో డబ్బులు వేస్తున్న ప్రయాణికుడు

సీతానగరం: నడి రోడ్డుపై జోలీ పట్టి బిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

ఈ పాట్లు ఇంకెన్నాళ్లు..?

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పూర్తి అధ్వాన్నంగా తయారవడంతో వాహన చోదకులకు పాట్లు తప్పడం లేదు. రహదారిపై పడుతూ లేస్తూ వెళ్లడం పరిపాటిగా వస్తుందని పలువురు వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం మక్కువ గ్రామానికి చెందిన ఓ వృద్ధ పాస్టర్ వాహనంతో రహదారి గోతిలో పడిపోవడంతో ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో మండలంలోని వాహన చోదుకులు ఇంకెన్నాళ్లీ పాట్లు పడాల్సి వస్తుందో తెలియడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా జనవరి నెలలో సంబర పోలమాంబ అమ్మవారి జాతర ప్రారంభం కావడం, సంక్రాంతి పండుగ కూడా రావడంతో మరింత రద్దీ పెరిగే ఆస్కారం ఉందని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి రహదారిని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గోతులో పడిపోయిన ద్విచక్ర వాహనదారుడు

గ్లోబల్ వార్మింగ్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉష్ణోగ్రత విపరీతంగా పెరగడం వల్ల వాతావరణంలో అనేక మార్పులు సంభవించి జన, ఆస్తి నష్టం జరుగుతుందని అవగాహన కలిగించడం కోసం బుధవారం పార్వతీపురంలో శ్రీజన్ స్కూలు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రదర్శన శ్రీజన్ స్కూల్ వద్ద ప్రారంభమై ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు కొనసాగింది. ఈ ప్రదర్శనను పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పల నాయుడు ప్రారంభించి మాట్లాడారు. కాలుష్యం పెరగడం వల్ల, ప్లాస్టిక్ వాడకం ఎక్కువ అవడం వల్ల, అడవులను నరికి వేయడం వల్ల, వాహనాలు పెరగడం వల్ల, భూ ఉష్ణోగ్రతలలో తీవ్రమైన మార్పులు సంభవిస్తున్నాయన్నారు దీనివల్ల ఓజోన్ పొరకు రంధ్రం ఏర్పడుతోందని ఫలితంగా భూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని గుర్తు చేశారు. ప్రజలం దరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, పర్యా వరణ రహిత పద్ధతులను పాటించాలని, మొక్కలను విరివిగా పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ యు. శ్రీను, ప్రిన్సిపాల్ డి. నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీను ప్రారంభిస్తున్న కమిషనర్

నేడు క్రిస్మస్ హై టీ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్ హై టీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం సాయంత్రం 6 గంటలకు స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ముఖ్య అతిధిగా విచ్చేస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు , జిల్లా అధికారులు, మైనారిటీ సంఘాల ప్రతినిధులందరూ ఈ కార్యక్రమానికి తప్పకుండా హాజరుకావాలని ముఖ్యంగా మైనార్టీలంతా హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్ కోరారు.

పంచగవ్యతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - పాచిపెంట

అన్ని పంటల్లో రెండుసార్లు పంచగవ్య పిచికారీ చేస్తే 20శాతం దిగుబడులు పెరిగినట్లుగా నిరూపణ అయిందని మార్కెట్లో దొరికే రసాయన అమైనో యాసిడ్స్, పెరుగుదల ఉత్ప్రేరకాల కంటే పంచగవ్య పనితీరు చాలా బాగుంటుందని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని బొబ్బిలివలసలో మహిళా రైతు బుడిపిల్ల విజయమ్మ ఆరేళ్లుగా తన రెండు ఎకరాల జీడి, మామిడి తోటలకు పంచగవ్య వాడుతున్నారని, ఈ ఏడాది పత్తికి కూడా పంచగా పిచికారీ చేశామని, పత్తిలో ప్రతి ఏటా ఐదున్నర క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తే ఈ ఏడాది ఏడున్నర క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని తెలిపారు. అంతేకాకుండా జీడి పంట మంచి దిగుబడు వస్తుందన్నారు. అనంతరం పంచగవ్య ద్రావణం పిచికారీ తయారీని వివరించారు. కార్యక్రమంలో విఎఎలు మోహన్‌కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

నెట్‌బాల్‌కు చరణ్

మక్కువ: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ జట్టులో మండలంలోని తూరు మామిడి గ్రామానికి చెందిన చరణ్‌కు చోటు లభించింది. ఈనెల 21 నుండి జార్ఖండ్ లో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ నెట్ బాల్ ఛాంపియన్ షిప్‌కు ఈనెల 18న ఎంపిక కమిటీ ఆంధ్ర ప్రదేశ్ నుండి హాజరవుతున్న జట్టులో యాసర్ల చరణ్ కు చోటు కల్పించారు. చరణ్ ప్రస్తుతం విజయవాడ ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు.

నీలకంఠాపురం పిహెచ్‌సిలో అరుదైన సంఘటన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం అరుదైన సంఘటన చోటుచేసుకుంది. వబ్బంగి సచివాలయం పరిధిలో గల పీరుముగూడకు చెందిన ఆరిక సరస్వతి నాలుగు కేజీల ఆడబిడ్డకు జన్మనిచ్చింది. పిహెచ్‌సి వైద్యాధికారి కె.అమరసింహారెడ్డి, వైద్య సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి ఆమెకు ధైర్యాన్ని ఇచ్చి సాధారణ ప్రసవం చేశారు. వైద్య సిబ్బంది మాట్లాడుతూ ఇదే మొదటిసారిగా తమ పిహెచ్‌సిలో నాలుగు కేజీల ఆడబిడ్డకు నార్మల్ డెలివరీ చేయడం జరిగిందని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె బంధువులు, గిరిజన ప్రజలు మాట్లాడుతూ ఇటువంటి అరుదైన సంఘటన తమ ప్రాంతంలో ఇదే మొదటిశారని ఆపరేషన్ లేకుండా నార్మల్ డెలివరీ చేసినందుకు వైద్యాధికారికి, వైద్య సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విశేష, లలిత, పార్వతి, ఎఎన్ఎం మల్లేశ్వరి, సూపర్వైజర్, జి.శ్రీహరిరావు పాల్గొన్నారు.

బిడ్డను పరీక్షిస్తున్న వైద్యులు

'ఆడుదాం ఆంధ్రా' పూర్తిస్థాయిలో సన్నద్ధతకండి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈ నెల 26నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు పూర్తిస్థాయిలో సన్నద్ధతతో ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుండి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణపై జిల్లా కలెక్టర్ తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 10వరకు 47 రోజుల పాటు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జరగనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ఇమిడివున్న ప్రతిభను వెలికి తీయడానికి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మట్టిలోని మాణిక్యాలను గుర్తించి తగిన ప్రోత్సాహం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యతోపాటు శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని తెలిపారు. గ్రామ సచివాలయం, మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రికెట్, వాలీ బాల్, కబడ్డీ, టెన్ని క్యాయిట్, ఖోఖో, వంటి ఐదు విభాగాల్లో క్రీడా పోటీలను సందడిగా నిర్వహించాలన్నారు. గ్రామస్థాయి నుండి అవసరమైన మైదానాలు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే క్రీడా కిట్లను ఆయా గ్రామ సచివాలయాలకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. జిల్లా స్థాయిలో 3కె మారథాన్ నిర్వహించాలన్నారు. ఇప్పటి వరకు 1.3 కోట్ల వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయని, 34.19 లక్షల క్రీడాకారులు పోటీలో పాల్గొంటున్నారని తెలిపారు. ప్రజా ప్రతినిదులు, అధికారులు క్రీడా పోటీల నిర్వహణను పర్యవేక్షించాలని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా క్రీడా పోటీల్లో నిర్వహిస్తున్నామని గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపేలా క్రీడాకారులను ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ అర్.గోవింద రావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్రరావు, డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వర రావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా, జగన్మోహన్ రావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, జిల్లా రవాణా శాఖ అధికారి సి. మల్లిఖార్జున రెడ్డి, వివిధ విభాగాల శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తాం

ప్రజాశక్తి - కురుపాం

రైతు పండించే చివరి ధాన్యపు గింజ వరకు కొనుగోలు చేస్తామని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. బుధవారం స్థానిక ఒకటో ఆర్‌బికె కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు పండించిన చివరి ధాన్యపు గింజ వరకు కొనుగోలు చేస్తామని రైతులు ఎవరూ అధైర్యపడొద్దని అన్నారు. రైతులు వారి గ్రామాల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్మి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎడిఎ నిర్మల జ్యోతి, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, ఎంపిటిసి సభ్యులు వి.బంగారు నాయుడు, స్వామియోజలు, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కె.సురేష్ కుమార్, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి

ఎఐటియుసి కన్వీనర్‌గా ఆర్‌విఎస్ కుమార్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎఐటియుసి జిల్లా కన్వీనర్‌గా ఆర్‌విఎస్ కుమార్ ఎన్నికయ్యారు. జిల్లా ఏర్పడక ముందు సిపిఐ, ఎఐటియుసి ఉద్యమ నిర్మాణంలో పూర్తి స్థాయిలో ఎనలేని సేవలందించి అనివార్య కారణాల రీత్యా వైసిపిలోకి వెళ్లిన ఆర్‌విఎస్ కుమార్ బుధవారం మళ్లీ ఎఐటియుసిలో చేశారు. ఉమ్మడి జిల్లాల ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ నేతృత్వంలో రాష్ట్ర కార్యదర్శి, మన్యం జిల్లా నాయకులు పడాల రమణ సమక్షంలో చేరారు. కుమార్‌తో అలజంగి కుమారమ్మ, సింహాద్రి, దుర్గారావు, పడాల రమణ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో కుమార్‌కు జిల్లా ఎఐటియుసి కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించారు.